

# కథా కౌముది

## పార్టీ టైమ్ సోమ సుధేష్ణ

"హాయ్ వినూ! ఈ శనివారం గీత వాళ్ళింట్లో వెడ్డింగ్ యానివర్సరీ పార్టి కదా! వాళ్ళకు గిఫ్ట్ తీసుకుని, మనకు గ్రోసరీ తీసుకుని వచ్చేసరికి లేటవుతుంది. పిల్లలకి డిన్నర్ పెట్టేయమని అమ్మకు చెప్పండి. ఫోన్ పె ట్టేస్తాను, ట్రాఫిక్ చాల ఉంది "

"డోంట్ వరీ సీమా, కేర్ ఫుల్ గా డ్రైవ్ చెయ్, బై" వినోద్ ఫోన్ పెట్టేసి ఇంటికి ఫోన్ చేసాడు.

"అత్తయ్యా! సీమకు రావడానికి లేట్ అవుతుందట. నాక్కూడా కాస్త లేటవుతుంది. ఆర్య, సూర్యని డిన్నర్ టైంకి తినేయమనండి. మీరు కూడా టైంకి డిన్నర్ తినేసేయండి. మాకోసం చూస్తూ లేట్ గా తినడం మీ ఆరోగ్యానికి మంచిది కాదు."

"సరే. మరీ లేటు చేయకండి." అంటూ అత్తగారు ఫోన్ పెట్టేసింది.

కాస్త లేటుగానే ఇంటికి చేరిన వినోద్ వచ్చీ రాగానే పిల్లలిద్దరి వైపు చూస్తూ అడిగాడు.

"హౌ వాజ్ యువర్ డే గైస్? డిన్నర్ తిన్నారా?"

"ఫైన్ డాడ్. డిన్నర్ ఎప్పుడో తినేశాం. రేపు పి.టి.ఎ. మీటింగ్ ఉంది కదా, మామ్మి వస్తోందా లేక నువ్వు వస్తున్నావా డాడ్?" లెవెంత్ గ్రేడ్ లో ఉన్న ఆర్య అడిగాడు.,

"మమ్మితో మాట్లాడాక ఎవరికి వీలవుతుందో చూద్దాం. హోమ్ వర్క్ చేసుకున్నారా? ఆర్య నీకేదో ప్రాజెక్ట్ డెడ్ లైన్ ఉందన్నావు ."

"యస్ డాడ్. ఈ రోజు బుక్ రిపోర్ట్ రాయాలి రేపు ప్రాజెక్ట్ చూస్తాను."

"సూర్య, నీ సంగతేమిటి!"

సూర్య గారాలు పోతూ "డాడ్ నా హోం వర్క్ చేసేసాను. నేను టి. వి. చూడొచ్చా?"

"ఒక్క షో మాత్రమే." తండ్రి మాట పూర్తి కాక ముందే టివి ఆన్ చేసి దాని ముందు కూర్చున్నాడు సూర్య.

పోయిన శనివారం వినోద్, సీమ పార్టి ఇచ్చారు. పార్టి కి రెండు రోజుల ముందు నుండి వినోద్, సీమ మరో లోకంలో ఉంటారు. ఆర్య హాయిగా రూంలో కంప్యూటర్ తో ఉంటాడు. ఆ రెండు రోజులు సూర్య వంటరి వాడై పోయినట్లు ఫీల్ అవుతాడు. తాతతో కొన్ని ఆటలు ఆడతాడు కాని చాల సేపు ఆడాలనిపించదు.. సూర్య వయస్సు వాళ్ళు పార్టికి వస్తే వాళ్ళతో చాల ఎంజాయ్ చేస్తాడు. పిల్లలు పెద్ద వాళ్ళు అని ఈమధ్య పేరెంట్స్ మాత్రమే కలుసు కుంటున్నారు.

పోయిన శనివారం ఇంట్లో పార్టికి సోహన్, శుభం, శివ వచ్చారు. సూర్యకు పండగ లాగుండింది. సోహన్, శివతో ఎన్నో గేమ్స్ ఆడుకున్నాడు. కానీ శుభం ఎప్పుడు పెద్ద వాళ్ళ మాటలు వింటూ వాళ్ళ దగ్గరే కూర్చుంటాడు. శుభం లాగ కాకుండా సూర్య అన్ని గేమ్స్ తీసి అక్కడ పెట్టాడు. ఎవరికి ఇష్టం వచ్చిన గేమ్స్ వాళ్ళు ఆడుకున్నారు. సూర్యకు చాల ఫన్ గా గడిచింది.

మరో శనివారం రానె వచ్చింది. ఈ సారి పార్టికి రానని సూర్య అనగానే ఇంతకు ముందులాగ రావాల్సిందే అనకుండ తల్లి వెంటనే

"ఫర్వాలేదులే, అక్కడ నీకు కంపేని కూడా లేదు. నానమ్మ తాత ఉన్నారుగా. తాతతో గేమ్స్ ఆడుకో. నానమ్మ నీకు హేరీ పాటర్ లాంటి కథలు చెప్తుంది. నువ్వు చాల లేట్ వరకు టివి చూడకు. ఓకేనా!" అప్పగింతలు మొదలవగానే తలాడించడం మొదలు పెట్టిన సూర్య ఆఖరి అప్పగింతతో తల ఊపడం ఆపేసాడు, వాళ్ళు ఆల్రడీ గరాజులోకి వెళ్లి పోయారు.

సూర్యకు బుర్రలో తల్లి దండ్రులు నిషేదించిన టివి ప్రోగ్రామ్స్ చూడాలని, ఇంకా వాళ్ళు వద్దన్నవి ఏవేవో చేసెయ్యాలని ఉబలాటంగా ఉంది. కాసేపు పోట్లాడటానికి ఆర్య కూడా లేడు. ఇంకేం తన ఇష్టం వచ్చినట్టు చేయొచ్చు. తాత పక్కన కూర్చుని టివి చూస్తున్న సూర్య మనసు లో గజిబిజిగా ఆలోచనలు కదులు తున్నాయి.

"కంప్యూటర్ గేమ్స్ ఏదైనా ఆడదామా?" రఘురాం అడిగాడు.

"నాట్ నౌ తాత" టివి వైపు నుండి తల తిప్పకుండానే అన్నాడు సూర్య. టివి చూడకుండా చేయాలని తాత ప్రయత్నం అని సూర్యకు తెలుసు. గ్రాండ్ పేరెంట్సు ఎక్కువ సేపు మెలకువగా ఉండలేరని కూడా సూర్యకు తెలుసు.

రాత్రి పదయింది ..

"సూర్యా, ఇక లే నాన్న పడుకునే టైమైంది. మాకు నిద్రోస్తోంది." అంటూ నానమ్మ లేచింది. ఆ వెంటనే తాతయ్య లేచి

"గెటప్ మై హీరో" అంటూ చెయ్యి చాచాడు.

"నాకు నిద్దర రావడం లేదు. వన్ మోర్ షో చూసి పడుకుంటాను తాతా!"

"కథ వింటూ పడుకుందువు రా." గుడ్నైట్ కిస్ ఇచ్చి వాళ్ళిద్దరూ లేచారు.

"నా రూమ్ లోనే పడుకుంటాను. గుడ్ నైట్" సూర్య లేచి పైకి తన రూమ్ లోకి వెళ్ళాడు.

ఎక్కువ సేపు కూర్చున్నా వీళ్ళిద్దరూ సగం నిద్రలో మంబులింగే తప్ప మాటలు తక్కువే అనుకున్నాడు.

ప్రపంచంలో అన్నీ తెలుసనుకునే దుడుకు వయసులో అడుగు పెట్టాడు సూర్య. ఎవరు ఏది చెప్పినా అందులో కొత్తేముంది అనే వయస్సు లోకి వస్తున్నాడు. అన్నీ అనుభవంలో చూడాలనే ఉత్సుకత ఉంది కానీ చాల వాటిలోకి తొంగి చూడలేని అదుపులు, అదుపులు దాటలేని అశక్తత. అన్నింటి మీద ఆసక్తి ప్రవేశిస్తున్న తోలి యౌవ్వనం. తర్టీన్ లో అడుగు పెట్టానని అప్పుడే మనసులోకి ఎక్కుతున్న పొగరు మొదలయింది.

టివి ఆఫ్ చేసి తన రూమ్ పక్కనే ఉన్న ఆర్య బెడ్ రూమ్ లోకెళ్ళాడు. ఆర్య డేవిడ్ తో స్పెండ్ చేయడానికి వెళ్ళాడు. కంప్యూటర్ లాక్ చేసుకుంటాడు. వాడి సీక్రెట్స్ అన్నీ అందులో ఉంటాయి. ఆర్య ఉంటె కాసేపు ఆడుకుని, పోట్లడుకునే వాళ్ళు– బావుండేది. సూర్యకు లోన్ లీగా అనిపించింది. గ్రాండ్ పేరెంట్స్ దగ్గర పడుకోవడానికి ఇష్టం అనిపించలేదు. నిద్ర వచ్చే సూచనలేవి లేవు. సెల్ ఫోన్ వాడలేదు. రాత్రి రేస్ట్రిక్టెడ్ మోడ్ లోకి వెళ్లి పోతుంది. పెరెంట్సును తప్ప ఎవరిని కాల్ చేయలేడు. ఏది చదివే మూడ్ లేదు. ఎదురు చూసిన ఒంటరితనం దొరికాక ఏం చేయాలో తోచలేదు.

బేస్ మెంటులో డాట్ బోర్డ్ ఉంది, చప్పుడు కూడా కాదు అనుకుంటూ బేస్ మెంటుకి వెళ్ళాడు. రోజూ తిరిగే ఇల్లే అయినా ఆ క్షణంలో నిశ్శబ్దంలో బిగుసుకు పోయాడు. ధైర్యం కూడ దీసుకుని నెమ్మదిగా బేస్ మెంటువేపు వెళ్ళాడు. పది నిముషాలు అడగానే బోర్ కొట్టింది. పక్కనే బార్ లైటు వేసాడు. డెస్క్ వెనక కెళ్ళి ఒక స్టూల్ పై కుర్చుని గ్రోనప్ లాగ ఏక్ట్ చేయడం మొదలు పెట్టాడు.

'డాడ్ ఫ్రెండ్స్ తో కలిసి ఈ బార్ దగ్గర ఎన్ని జోకులు — ఎంత నవ్వుతారు! ఫన్ టైం. చాల మజాగా ఉండి ఉంటుంది

డాడి వర్క్ స్ట్రెస్ లో ఉన్నపుడు డ్రింకు తీసుకుంటాడు. కొన్నిసార్లు మామ్మి కంపెని ఇస్తుంది. కొన్నిసార్లు "తాగింది చాలు, ఇక ఆపండి" అంటుంది. తాగే వాళ్ళకే తెలుస్తుంది ఏ బాటిల్ లో ఎంత పవర్ ఉందో అంటాడు ఆర్య.'

కేబినేట్ తెరిచాడు. దాన్నిండా రంగు రంగుల, రకరకాల షేప్స్ తో బాటిల్స్ –

"నా ఫేవరేట్ కలర్ రెడ్ సో.." అంటూ రెడ్ లేబిల్ విస్కీ బాటిల్ తీసుకుని ఒక గ్లాసులో పోసి ఒక్క గుక్కలో తాగేసాడు. గొంతంతా మంట. అ బాటిల్ తో పాటు తన బెడ్ రూమ్ లో కెళ్ళాడు. గొంతులో మంట,

"గ్రోయింగ్ అప్ పెయిన్స్ " నవ్వాలని ట్రై చేసాడు.

సీమ, వినోద్ ఇంటికి వచ్చేసరికి రాత్రి పన్నెండు దాటింది. వాళ్ళ బెడ్ రూమ్ కి వెళ్ళే ముందు అలవాటు ప్రకారం పిల్లలను ఒకసారి చూసి, తన్నేసిన దుప్పటిని సరిగ్గా కప్పడం సీమకు అలవాటు. సూర్య గది తలుపు పుష్ చేసింది, గది తలుపు లాక్ చేసుకున్నాడు. సీమ ఆశ్చర్య పోయింది. ఇన్ని ఏళ్ళల్లో ఏ ఒక్కనాడు డోర్ లాక్ చేసుకోలేదు. ఓరగా తీసి ఉంచుతాడు. గట్టిగా వినోద్ కోసం అరవ బోయింది కానీ సూర్య లేస్తాడేమో నని గబగబా వెళ్లి బెడ్ రూమ్ లో బట్టలు మార్చుకుంటున్న వినోద్ తో

"వినూ! ఒకసారి ఇటురా! సూర్య బెడ్ రూమ్ తలుపు లాక్ చేసుకున్నాడు.." గాభరాగా అంటూ వినోద్ చెయ్యి పట్టుకుని గబగబా సూర్య రూమ్ వేపు తీసికెళ్లింది.

వినోద్ తలుపు గట్టిగా తోసాడు. లాక్ చేసిఉంది.

"సూర్యా! సూర్యా! డోర్ ఓపెన్ చెయ్యి." వినోద్ గట్టిగానే అన్నాడు. ఏమి జవాబు లేదు.

"బాగా నిద్దరలో ఉన్నట్టున్నాడు. మధ్య రాత్రి కదా, పడుకోనియ్, పొద్దున్నేచూడొచ్చు." ఆవులింత తీస్తూ అన్నాడు వినోద్. వినోద్ కు ఈ రోజు డ్రింక్ కాస్త ఎక్కువే పడింది . ఈరోజు సీమ డిజిగ్నేతేడ్ డ్రైవర్ ఈజిగ తీసుకున్నాడు.

"డోర్ ఓపెన్ చేయండి, ఒకసారి సూర్యను చూసి వెళ్లి పడుకుంటాను." సీమ బాధగా, ఆరాటంగా అంది.

"కొన్ని గంటల్లో వాడు లేస్తాడుగా, ఇప్పుడు వాణ్ణి లేపి హడావుడి చేయడమెందుకు"

వినోద్ మాటలు కాస్త ముద్ద ముద్దగా వస్తున్నాయి

"ఎప్పుడూ డోర్ లాక్ చేసుకోడు." సీమకు డోర్ పైన పెట్టిన లాక్ గుర్తుకు వచ్చింది.

"డోర్ మోల్డ్ పైన కీ ఉంటుంది. తడిమి చూడండి."

"అబ్బా సీమా! ఏమిటి ఈ పిడకల వేట, నాకు బాగా నిద్దరొస్తోంది. నిలబడే ఓపిక లేదు. నన్ను పడుకోనివ్వు."

"కీస్ నాకిచ్చి మీ రెల్లి పడుకోండి ప్లీజ్!" దుఃఖాన్ని అణుచుకుంటూ వేడుకుంది.

కాదనలేక తూలుతూ డోర్ మోల్డ్ పైన తడిమాడు. మేకులాంటిది కింద పడింది. సీమ వంగి దాన్ని తీసుకుని

"ఇదే నండి కీ. థాంక్ గాడ్. ఇక మీరు వెళ్ళొచ్చు." గబగబా డోర్ ఓపెన్ చేసింది.

సీమ నైట్ లైట్ మసక వెలుగులో అడ్డదిడ్డంగా పడుకున్న సూర్యను చూస్తూ

"భయం వేసిందేమో తలుపు వేసుకున్నాడు. బాగా నిద్రలో ఉన్నాడు. షీట్ గూడ తన్నేసాడు." అనుకుంటూ షీట్ కప్పి ప్రేమగా తల నిమురుతున్నసీమ షాక్ తగిలినట్టుగా చిన్న కేక్ వేసింది. సూర్య నోట్లోంచి విస్కీ వాసన గుప్పు మంది. పక్కనే దిండు కింద దాగలేక్ తోంగి చూస్తున్న విస్కీ బాటిల్ ! తలుపు దగ్గర కెళ్ళి

"వినోద్ " ఏడుపు, భయంతో గట్టిగా అరిచింది. పడకెక్క బోతున్న వినోద్ ఆ అరుపు విని మత్తు దిగి పోయి పరుగెత్తు కొచ్చాడు.

మంచంపై ఉన్న సూర్యను, విస్కీ సీసాతో మంచం మీద కూర్చున్న సీమను చూడగానే వినోద్,

"ఓ మై గాడ్!" అంటూ గుండె మీద చెయ్యి వేసుకున్నాడు.

ఇద్దరూ సూర్యను లేపాలని చూసారు. ఎంత పిలిచినా ఉలుకూ పలుకు లేదు. శ్వాస కూడా నెమ్మదిగా ఉంది. వినోద్ వెంటనే 911 కు కాల్ చేసాడు. నీళ్ళు తెచ్చి మొహం పై చిలకరించారు. చలనం లేదు. వినోద్ ఎత్తుకోబోయాడు కానీ సూర్య తల వెళ్ళా డుతోంది. సీమ గట్టిగా ఏడుస్తోంది, వినోద్ కు కూడా కన్నీరు ఏకధాటిగా కారుతోంది.

అంబులెన్స్ త్వరగానే వచ్చింది. ఆ హడావుడికి లేచి వచ్చిన తల్లి దండ్రులకు ధైర్యంగా ఉండమని ఫోన్ దగ్గర పెట్టుకుని పడుకోమని చెప్పాడు వినోద్. సూర్యను దగ్గరే ఉన్న హాస్పిటల్ కు తీ సికెల్లారు. ER లో వాళ్ళు చెప్పిన చోటల్లా మర బొమ్మల్లా సంతకం చేసి సీమ, వినోద్ ఆ పక్కనే ఉన్న వెయిటింగ్ రూమ్ లో కూర్చున్నారు. జోగుతూ, ఉలిక్కి పడుతూ అలా గంటలు గడిచాయి. మార్నింగ్ ఎనిమిది గంటలకు డాక్టరు పిలుస్తున్నాడు అని నర్స్ చెప్పింది.

ఇద్దరు ఒక్క పరుగున డాక్టర్ దగ్గరకు చేరారు. ఇండియన్ డాక్టర్ కావడంతో ప్రాణాలు లేచి వచ్చాయి ఇద్దరికి. అసహనంగా చూస్తున్న డాక్టరు వేపు చూస్తూ "సూర్య.. ఎలా ఉన్నాడు" కళ్ళు తుడుచు కుంటూ నసిగాడు వినోద్.

"ఇంతకు ముందు డ్రింకు తీసుకున్నాడా లేక ఇది మొదటి సారా?"

"ఎప్పుడు ఇలా జరగా లేదు. అసలు డ్రింక్ జోలికే వేల్లడు. మాకు షాకింగుగా ఉంది."

"బాయ్ అండ్ మీరు కూడా చాల లక్కి, ఎక్కువగా తాగేసాడు. ఇప్పుడు ప్రాణానికేమి ప్రమాదం లేదు. అంతా ఫ్లష్ చేసాము. 24 గంటలు ఇక్కడే ఉంటాడు."

సీమలో ఆపుకోలేని దుఃఖం పైకే పొంగింది.

"ఇప్పుడు ఏడిస్తే ఏం లాభం చెప్పండి. ముందే కాస్త జాగ్రత్తగా ఉంటె బావుండేది. టివి కంట్రోల్ చేస్తారు, ఐ ఫోన్ కంట్రోల్ చేస్తారు, కంప్యూటర్ కంట్రోల్ చేస్తారు కానీ బార్ మాత్రం ఓపెన్ చేసి పెడ్తారు..." పశ్చాత్తాపంతో కుమిలి పోతున్న వినోద్ ను ఏడుస్తున్న సీమను చూసి చెప్పడం ఆపేసి,

"ఇప్పుడు నిద్ర పోతున్నాడు. నర్స్ వచ్చి మిమ్మల్ని తీసుకెళుతుంది. మీరు వెళ్లి చూడొచ్చు. బి కేర్ ఫుల్ సో నెక్స్ట్ టైం ఇట్ వొంట్ హేప్పెన్". అంటూ అక్కడినుండి వెళ్లి పోయాడు.

"ఈ రోజూనేలా రానిచ్చాను! భగవంతుడా !" వినోద్ కు ఈ కొన్ని గంటల్లో జీవిత పాటాలన్నీ అర్థం అయినట్లనిపించింది.

"విలువైన వారిని ఇండియాలో వదిలి సుఖాలు జుర్రు కుందామని ఈ దేశం వచ్చాము. ఇక్కడ కూడా విలువైనవి పోగొట్టుకున్నాక ఇక మనకు మిగిలేది ఏమిటి! జీవితాన్ని సరి చేసుకోవాలి సీమా" గాద్గాదికమైన గొంతుతో చిన్నగా అన్నాడు వినోద్. సీమ సమ్మతంగా తలాడించింది.

నర్స్ తో పాటు రూమ్ లోకి వెళ్ళారు. ముద్దుల కొడుకు, పసివాడు అలా మంచం మీద పడుకుని ఉంటె ఇద్దరికీ గుండె తరుక్కు పోయింది.

'ఎందుకు ఇలా చేసావు సూర్యా' అని అడిగే అర్హతను కోల్పోయిన తల్లిదండ్రులు దిగాలుగా పక్కనే ఉన్న కుర్చీలో కూచున్నారు.

జీవితాన్ని రీ షఫుల్ చేసి అన్ని మార్చేయాలి అని అనుకున్నాడు వినోద్. పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటానని దేవుడికి ప్రమాణం చేసింది సీమ.

సూర్య మూలుగు వినిపించగానే ఇద్దరూ పరుగెత్తి "నాన్నా సూర్యా!" తల నిమురుతున్న తల్లిని మగతగా చూసిన సూర్య

"ఈజ్ ఇట్ పార్టి టైం మామ్" అస్పష్టంగా అన్నా వినోద్ కు సీమకు అర్థం అయ్యింది.

తమ అజాగ్రతకు గురైన కొడుకును చూసి బాధ ఒకవైపు, పెద్ద ప్రమాదం తప్పిందనే స్వల్ప ఆనందం మరోవైపు రెండు పొంగుతూంటే కళ్ళల్లో నీళ్ళు, మొహంపై మందహాసంతో ఈ ఒక్క జీవిత పాఠం చాలు అనుకున్నారు.

★★★

**Click here to share your comments on this story**